అందరి లక్ష్యం .. ఆర్డీటీ పరిరక్షణే ధ్యేయం



బాల వెంకటాపురంలో ఆర్డీటీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి చిత్రంలో తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే సుధాకర్



సేవ్ ఆర్డీటీ పాదయాత్రకు తరలివచ్చిన కార్యకర్తలు,నాయకులు, ప్రజలు

- సేవ్ ఆర్డీటీ పాదయాత్రకు పార్టీలకతీతంగా సంఘీభావం

కళ్యాణదుర్గం రూరల్: అందరి లక్ష్యం..ఆర్డీటీ పరిరక్షణే ధ్యేయమని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చేస్తున్న 'సేవ్ ఆర్డీటీ' పాదయాత్రకు పార్టీలకతీతంగా సంఘీభావం తెలుపుతున్నారు. ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర 12వ రోజు ఆదివారం కళ్యాణదుర్గం మండలంలో ప్రారంభమై బాల వెంకటాపురం, కద రంపల్లి, కొండాపురం, వెంకటంపల్లి, ముద్దినాయనపల్లి వరకు సాగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా సాగింది. గ్రామాల్లో ఆర్డీటీ చేసిన సేవలపై రంగయ్య ఆరా తీస్తూ ముందుకు కదిలారు. కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, మున్సిపాలిటీ కన్వీనర్ ఐ సుధీర్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, ఎంపీపీలు భీమేష్, నాగరాజు, వివిధ మండలాల కన్వీనర్లు ఎంఎస్ రాయుడు, జీకే రాయుడు, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, రామాంజనేయులు యాదవ్, పాతలింగ, గోపాల్ రెడ్డి, పిల్లలపల్లి అంజి, కామక్కపల్లి మల్లి, చరణ్, శ్రీకాంత్, బిక్కిహరి, ఎస్. తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, జేసీఎస్ కన్వీనర్లు గంగాధర్, అంజి, నాగలక్ష్మి, చందన శివాజీ, వైస్ ఎంపీపీ కాంతమ్మ, సునీత, లింగమ్మ, ఆయా గ్రామాల సర్పంచులు సోమశేఖర్, చంద్రానాయక్, నగేష్ నాయక్, రుద్ర, ఎంపీటీసీలు ధనుంజయ, వెంకట్రామ్ నాయక్, నాగలక్ష్మి, బుసెప్ప, సీపీ తండా రాయుడు, బాల వెంకటాపురం శేఖర్, నిజాంవలి, తిప్పానాయక్, ఇమాంవలి, జిలాన్, ధనుంజయ, నూర్, షేక్షావలి, సర్దానప్ప, తిప్పన్న, వలి, ఈశ్వరయ్య, సూర్యనారా యణ, శివలింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధా, దురదకుంట వన్నూరుస్వామి, లక్ష్మన్న, నారాయణస్వామి, వెంకటేశులు, తిప్పయ్య, అంజి, ఓబిలేశు,హరీష్, వంశీ, కదరంపల్లి రామాంజనేయులు, తిరుపాల్, విరుపాక్షి, రాజప్ప, కిరీటీ యాదవ్, జానీ, మల్లి, రాము, నాయక్, సోమశేఖర్, మంజు పాల్గొన్నారు.

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సంఘీభావం..

ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు ఆదివారం జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగోపాల్ ఆదివారం సంఘీభావం తెలిపారు.

పేదరిక నిర్మూలనే ఆర్డీటీ ధ్యేయం

కళ్యాణదుర్గం: పేదరిక నిర్మూలనే ఆర్డీటీ ధ్యేయమని మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. కళ్యాణదుర్గం మండలం బాలవెంకటాపురంలో ఆదివారం రంగయ్య చేపట్టిన పాదయాత్రకు సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డితో కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ మొదటి సారిగా బెళుగుప్ప మండలం గొంచితండాలో సేవా కార్యక్రమాలు ప్రారంభించి, ఉమ్మడి జిల్లాతో పాటు ఏపీ, తెలంగాణలోనూసేవలు విస్తరించింద న్నారు. ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ సేవలపై కేంద్రీయ విశ్వవిద్యాలయం సహకారంతో కుందుర్పి మండలం అపిలేపల్లిలో ఆర్డీటీ సేవలపై అధ్యయనం చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆర్డీటీని మూసివేస్తే జరిగే నష్టాన్ని ప్రజలకు తెలియపరుస్తున్నానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, పార్టీ మండల కన్వీనర్ గోళ్ల సూర్యనారాయణ, జడ్పీటీసీలు బొమ్మయ్య, గుద్దెళ్ల నాగరాజులతో పాటు వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ వైఎస్సార్‌సీపీ నేతల సంఘీభావం

ఉరవకొండ: ఆర్డీడీ పరిరక్షణ కోసం రంగయ్య చేస్తున్న పాదయాత్రకు 12వ రోజు ఆదివారం ఉరవకొండ వైఎస్సార్‌సీపీ నేతలు సంఘీభావం తెలిపారు. బాల వెంకటాపురం గ్రామంలో కొనసాగుతున్న పాదయాత్రలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పీ టీసీ సభ్యులు సింగాడి తిప్పయ్య, వెలిగొండ సర్పంచ్ వీరాంజనేయులు, పార్టీ నాయకులు కె.వి.తిప్పయ్య, సుంకన్న, సిద్దప్ప పాల్గొన్నారు.



రంగయ్యతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఉరవకొండ వైఎస్సార్‌సీపీ నాయకులు

పాదయాత్రకు పలువురు నేతల సంఘీభావం

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ పరిరక్షణకు మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు ఆదివారం అనంతపురం, ఉరవకొండ నేతలు సంఘీభావం తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, అనంతపురానికి చెందిన బోయ తిరుపాల్, కుమ్మర ఓబిలేశు, తపోవనం చిందంబర రెడ్డి, వై.రామకృష్ణ రెడ్డి, శేఖర్, ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, వీరాంజనేయులు, సుంకప్ప, సిద్దప్ప, తలారి సుంకన్న సంఘీభావం తెలిపారు.



ముద్దినాయనపల్లిలో రంగయ్య పాదయాత్రకు భారీగా కదిలిన జనం



కదరంపల్లిలో కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొండాపురం వద్ద రంగయ్య పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు



జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ సంఘీభావం

ఏడాది కూటమి పాలన మోసం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



పుస్తకం విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన మోసపూరితమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివ కుమార్, రాయదుర్గం, డి హీరేహాళ్, కణేకల్లు మండల కన్వీనర్లు రామాంజనేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెన్న, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి లతో కలసి 'జగన్ అంటే నమ్మకం .. చంద్రబాబు అంటే మోసం' పుస్తకం ,పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ కూటమి నేతలు ప్రతిపక్ష నాయకులపై ఆటవిక దాడులు చేస్తూ, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. ఎటుచూసినా దాడులు, దౌర్జన్యాలు, దందాలు, దోపిడీలు, మహిళలపై అఘాయిత్యాలు వెలుగుచూస్తున్నాయన్నారు. ఊరూరా మద్యం మాఫియాతో పాటు ఇసుక, మట్టిదోపిడీ అధికమైందని విరుచుకుపడ్డారు. ఏడాది పాలనలో కూటమి సర్కార్ రూ.1.51 లక్షల కోట్లు అప్పు చేసినా సంక్షేమం, అభివృద్ధి లేదన్నారు. సూపర్‌సిక్స్ హామీలపై వైఎస్సార్‌సీపీ ఒత్తిడి పెంచడంతో ఏడాది తర్వాత తల్లికి వందనం అమలు చేశారని దుయ్యబట్టారు. మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు ఏడాదికి రూ.18 వేలు ఎప్పుడు జమ చేస్తారో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే సచివాలయ ఉద్యోగాలు, వలంటీర్ల నియామకానికి చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. విద్య, వైద్యం తో పాటు అనేక రంగాల్లోనూ మాజీ సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపలేదన్నారు. కొందరు పోలీసుల తీరు మారాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ కేసులు పెట్టడం, ఇబ్బందులకు గురిచేయడం లాంటివి మానుకోవాలని హితవుపలికారు. కమిటీలతో పార్టీ బలోపేతం : వైఎస్సార్‌సీపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేలా కృషి చేస్తున్నామని మెట్టు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల్లోనూ సమర్థులకు అవకాశం కల్పించామన్నారు. బూత్ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామన్నారు. ప్రజల పక్షాన గట్టిగా పోరాటం చేస్తామన్నారు.

శాంతిధామం.. కిక్కిరిసిన భక్త జనం

- చత్రప్రభ అలంకరణలో సద్గురు ఎర్రితాత స్వామి దర్శనం
- ముగిసిన ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు



చత్రప్రభ అలంకరణలోని ఎర్రితాతస్వామి



ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవం

బెళుగుప్ప: స్థానిక శాంతిధామంలో వెలసిన అవధూత సద్గురు ఎర్రితాత ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. చివరి రోజున స్వామి వారు చత్రప్రభ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి బిల్వార్చనలు, మహాభిషేకాలు, మంత్ర పుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడ్డారు. పరుషలో గాజుల అంగళ్లు, బొమ్మల, చిరుతిండి దుకాణాలతో సందడి నెలకొంది. బెళుగుప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్ విద్యార్థులు రెండురోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్‌ఐ శివ, ఏఎస్‌ఐ రామదాసు తమ సిబ్బందితో కలసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

కబ్జాల పర్వం.. పట్టాల కుంభకోణం

- ఒక్కో లేఔట్‌లో 200లకు పైగా గుర్తింపు
- అక్రమార్కుల చేతుల్లోకి 'దుర్గం' గౌడ, బీటీపీ, మల్లాపురం లేఔట్లు
- నోటీసుల జారీతో నకిలీ పట్టాదారుల్లో వణుకు
- రూ.కోట్లు చేతులు మారిన వైనం



లేఔట్‌లో కొనసాగుతున్న అక్రమ కట్టడాలు



బోగస్ పట్టాలు

రాయదుర్గం: పట్టణంలోని ప్రభుత్వ లేఔట్లలో కబ్జాల పర్వం.. నకిలీ పట్టాల కుంభకోణం కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి, గౌడ, బీటీపీ, మల్లాపురం లేఔట్లలో జరిగిన అక్రమాలను తహసీల్దార్ గుర్తించారు. రికార్డుల్లో ఉండే ప్లాట్ నంబర్ల ప్రకారం లబ్ధిదారుడి పేరుతో నోటీసులు అతికిస్తున్నారు. దీంతో బోగస్ పట్టాలు పొందిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గౌడ లేఔట్‌లో ఓ పేద మహిళకు 563 ప్లాట్ నంబర్‌ను రెవెన్యూ రికార్డుల ప్రకారం 2020లో అప్పటి తహసీల్దార్ అందించారు. ఆ వివరాలను (హెచ్ఎస్ఆర్‌డీ ఐఎస్ - 10/2020) దస్త్రాల్లోనూ నమోదు చేశారు. అయితే బదిలీపై వెళ్లిన ఓ అధికారి మరో వ్యక్తితో రూ.లక్ష దాకా నగదు తీసుకొని నకిలీ పట్టా కట్టబెట్టారు. దీనిపై క్షేత్రస్థాయిలో ఇరువురు ఘర్షణ పడి, న్యాయం కోసం తహసీల్దార్‌ను ఆశ్రయించారు. పట్టణంలోని గౌడ, బీటీపీ, మల్లాపురం లేఔట్లలో సుమారు 700 లకు పైగా నకిలీ పట్టాలు గుర్తించినట్టు తెలుస్తోంది. ఒక్కో పట్టా రూ.2.50 నుంచి రూ.3 లక్షలకు పైగా విక్రయించడంతో పేదల సొమ్ము రూ.కోట్లలోనే అక్రమార్కుల జేబులోకి చేరినట్లు తెలుస్తోంది. రాయదుర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో ఇక్కడ స్థిరపడేవారి సంఖ్య పెరుగుతోంది. దీన్ని అదునుగా తీసుకున్న అక్రమార్కులు తక్కువ ధరకే ఎక్కువ సైజు 2.50 సెంట్ల స్థలం లేఔట్లలో దొరుకుతుందని ఆశ చూపి రూ.లక్షలు వసూలు చేశారు. సదరు అధికారిని ఆశ్రయించి నకిలీ పట్టాలు పొంది అమాయకుల చేతిలో పెట్టారు. తాజాగా సర్వే నిర్వహించి, అసలు లబ్ధిదారుల బాబితా ప్రకారం ప్లాట్ల వారీగా నోటీసులు అతికిస్తుండడంతో బోగస్ పట్టాదారుల్లో ఆందోళన మొదలైంది. సదరు అధికారిని ఫోన్లలో నిలదీస్తే తాను ఇప్పుడు బదిలీపై వచ్చాను? ఆ పట్టాలతో నాకు సంబంధం లేదు? ఇంతకీ వాటిపై నా సంతకం లేదు? నేను ఇవ్వలేదు? అనే సమాధానంతో దాటవేశారని బాధితులు వాపోతున్నారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలపై నిగ్గు తేల్చాలని ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

పక్కాగా బోగస్ పట్టాలు?

ఇందిరమ్మ స్థలాల్లో ఇళ్లుకట్టకుండా వదిలేసిన ఖాళీ స్థలాలను గుర్తించి అక్రమాలు సాగించారు. కాలనీల స్కెచ్‌లను రెవెన్యూ అధికారి నుంచి బోగస్ పట్టాల ముఠా పొందింది. ఆ మేరకు లేఔట్‌లో ఖాళీగా ఉండే బ్లాక్‌లు గుర్తించారు. అక్కడ ఏ, బీ అనే సబ్ డివిజన్ నంబర్ల ద్వారా ఒరిజినల్ హద్దులనే పెట్టి పట్టాలు తయారు చేశారు. అమాయకులకు చుక్కలు చూపారు. గతంలో రాయదుర్గం తహసీల్దార్‌గా పనిచేసిన సుబ్రమణ్యం.. వీఆర్ఎస్ తీసుకుని వెళ్లిపోయారు. ఈ అధికారి సంతకాన్ని ఎక్కువ శాతం ఫోర్జరీ చేసి పట్టాలు సృష్టించినట్టు తెలుస్తోంది. ఏకంగా తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బోగస్ పట్టాలు ఏరివేస్తాం

గౌడ, బీటీపీ, మల్లాపురం లేఔట్లలో బోగస్ పట్టాలు ఏరివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం . ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు. ఇప్పటికే 724 పట్టాలు ఖాళీలను గుర్తించాం. తమ జాబితా ప్రకారం అర్హత కలిగిన వారికి అవకాశం కల్పిస్తాం . బోగస్ పట్టాలతో వస్తే కేసులు నమోదు చేయిస్తాం. ఆ పట్టాలు ఎవరిచ్చారో వారినే ప్రశ్నించాలి. రెవెన్యూ రికార్డుల ప్రకారం పట్టా పొందిన వారందరికీ అండగా నిలుస్తాం. ఖాళీగా ఉన్నవాటికి అర్హులను గుర్తించి, పట్టాలు అందిస్తాం. నకిలీ పట్టాలు ఎవరిచ్చారు? ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయి? దీని వెనుక ఉండే సూత్రదారి ఎవరనే దానిపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిస్తాం.

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

క్లుప్తంగా

యోగాంధ్ర పోటీలకు 13 మంది ఎంపిక



యోగా పోటీలకు వెళ్తున్న విద్యార్థులతో ఎంపీడీఓ, యోగా గురువు

ఉరవకొండ: ఉరవకొండకు చెందిన 13 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ రవిప్రసాద్, యోగా గురువు వెంకట్ తాడికొండ గురూజీలు తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విజయవాడకు వెళ్తున్న విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అనంతపురం లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో అద్భుత ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికు ఉరవకొండకు చెందిన విద్యార్థులు 13 మంది ఎంపిక కావడం గర్వకారణం అన్నారు.

'ప్రజలను మభ్య పెడుతున్న చంద్రబాబు'

కూడేరు: హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మభ్య పెడుతున్నాడని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేశవరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యవర్గ సభ్య సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ అమలు చేయకుండా చంద్రబాబు నెలకో పథకం అమలు అంటూ ఏడాది పాలన పూర్తి చేశారని అన్నారు. పింఛన్ రూ.4 వేలకు పెంచి చేసి వెరిఫికేషన్ పేరిట అనేక మంది పింఛన్లను తొలగించారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలాలు కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఊసే లేదన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీకి పరీక్షలు



అధికారుల సమక్షంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉరవకొండ: స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు కాన్పూర్ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలిమికో) ఆధ్వర్యంలో పరికరాలకోసం ప్రత్యేక శిబిరం ఆదివారం పరీక్షలు చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈశిబిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులు తరలివచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్, ఎంపీడీఓ రవిప్రసాద్, మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'తల్లులను వంచన చేసిన పథకమిది'

బొమ్మనహాళ్: కూటమి ప్రభుత్వ హామీలు చూస్తే కోటలు దాటాయిగానీ అమలు మాత్రం గడప దాటలేదని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కాస్త.. కోతల ప్రభుత్వంగా మారిందన్న విషయం తల్లికి వందనం అమలులో తేలిపోయిందన్నారు. ఇది తల్లికి వందనం పథకం కాదు.. తల్లులను వంచన చేసిన పథకమన్నారు.

యువకుడిపై దాడి

కణేకల్లు: యర్రగుంటలో భూమి తగాదాలో ఆదివారం జరిగిన దాడుల్లో యువకుడికి గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. నాగేంద్ర భూమి చదును చేసేందుకు నగేష్ పొలంమీదుగా జేసీబీ, ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. తన పొలంలోనే ఎందుకొచ్చారని నగేష్ నాగేంద్రను ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన నాగేంద్రతోపాటు మరో ముగ్గురు నగేష్‌పై దాడి చేశారు. ఈ దాడిలో నగేష్ తలకు బలమైన గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక సాయం

శెట్టూరు: ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ ముగ్గురు బాధితులకు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. శెట్టూరు మండలం కై రేవుకు చెందిన హరిజన వన్నూరుస్వామి చికిత్సకోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన ఓబుళమ్మ, పి.వెంకటాంపల్లికి చెందిన వన్నూరప్పకు ఆర్థిక సహాయం అందజేశారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సాయినాథ్, మహాలింగ పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



ఉరవకొండ: స్థానిక వాసవీ కల్యాణ మంటపం సమీపంలో కవితా ఫొటో స్టూడియో యజమాని పిండికూర విజయ్‌కుమార్ ఇంట్లో శనివారం అర్ధరాత్రి రెండు బ్రహ్మకమలాలు విరబూశాయి. అరుదైన బ్రహ్మకమలాలకు విజయ్‌కుమార్ స్థానికులు పూజలు చేశారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



వెంకటాక్షిపతిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

బొమ్మనహాళ్: నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటాక్షిపతిరెడ్డి పిలుపునిచ్చారు. వెంకటాక్షిపతిరెడ్డిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ఆదివారం గోనేహాళ్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సన్మానించారు. వెంకటాక్షిపతిరెడ్డి మాట్లాడుతూ కమిటీలో చోటు కల్పించినందుకు జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటస్వామి, నాయకులు ఉలిగప్ప, గంగాధర, రాజన్న, గుమ్మ రాజప్ప, యన్నప్ప, హనుమంతు, తలారి ఉలుగప్ప, రామాంజి, వన్నూరుస్వామి, వంద్రప్ప, సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు తహసీల్దార్‌గా బ్రహ్మయ్య

కణేకల్లు: కణేకల్లు తహసీల్దార్ బ్రహ్మయ్యను నియమిస్తూ ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కొన్ని నెలల నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. రాయదుర్గం తహసీల్దార్ నాగరాజు ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. శింగనమలలో పని చేస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్యను కలెక్టర్ కణేకల్లుకు నియమించారు.

'అపూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. దశాబ్దాల తర్వాత అందరూ పాఠశాలలో ఇలా కలవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకొని, సరదాగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను సన్మానించారు.

గతుకుల రోడ్లు.. అవస్థల ప్రయాణం



గుంతలు ఏర్పడిన చీకలగురికి రోడ్డు

విడపనకల్లు: ఉరవకొండ నుంచి మండలంలోని చీకలగురికి వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఎప్పుడో నిర్మించిన బీటీ రోడ్డు కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. రోడ్డు అంతా దెబ్బతినింది. గ్రామ సమీపానికి దగ్గరలో పెద్ద వంక కల్వర్టు కూడా పూర్తిగా దెబ్బతినింది. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పెద్ద వంక నీటి ఉధృతికి కల్వర్టు మధ్యలో పెద్ద రంధ్రం పడి ప్రయాణానికి ఆటంకంగా ఉందని స్థానికులు అంటున్నారు. కల్వర్టు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతోందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న పెద్ద వంక కల్వర్టు, బ్రిడ్జి నిర్మించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కల్వర్టు